క్లుప్తంగా

సుస్థిర వ్యవసాయంలో ఏపీ ముందంజ

మైలవరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పాలనలో సుస్థిర వ్యవసాయంలో ఆంధ్రప్రదేశ్ ముందంజలో ఉందని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వ్యవసాయ రంగంలో 51 సూచికలను ప్రామాణికంగా ఐకార్ శాస్త్రవేత్తల అధ్యయనం మేరకు సుస్థిర వ్యవసాయాభివృద్ధిలో జాతీయ సగటు కంటే ఎక్కువ సాధిస్తున్న టాప్ ఐదు రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ జాతీయ సగటు 0.50 నమోదు కాగా రాష్ట్ర సగటు 0.53 ఉందన్నారు. ఇది రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయాభివృద్ధిలో సాధిస్తున్న ప్రగతికి తార్కాణమని ఎమ్మెల్యే వసంత పేర్కొన్నారు.

నేటి నుంచి తాగునీటి సరఫరాకు అంతరాయం

ఇబ్రహీంపట్నం: రక్షిత తాగునీటి పథకం పైప్ లైన్‌కు ఇంటర్ కనెక్షన్ పనులు జరుగుతున్నందున రెండు రోజుల పాటు తాగునీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆ శాఖ డీఈఈ ఎం.దయానంద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పైప్‌లైన్ పనుల నేపథ్యంలో ఇబ్రహీంపట్నం గ్రామం, మూలపాడు వైపు వెళ్లే కృష్ణా వాటర్ సరఫరాకు శుక్ర, శనివారం అంతరాయం కలుగుతుందన్నారు. ప్రజలు ప్రత్యామ్నాయంగా తాగునీటి వసతి చూసుకుని సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

ఎంపీపీ పాఠశాలలో మెరక పనులు



కేతనకొండ(ఇబ్రహీంపట్నం): రెండు రోజులుగా విస్తారంగా కురుస్తున్న వర్షాల వలన కేతనకొండ ఎంపీపీ పాఠశాల ఆవరణ బురదమయంగా మారింది. దీంతో విద్యార్థులకు ఇబ్బందిగా మారడంతో పాఠశాల ఉర్దూ ఉపాధ్యాయుడు ఇర్ఫాన్ పాషా మండల కో ఆప్షన్ సభ్యుడు పఠాన్ నాగుల్ మీరా దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. తక్షణమే స్పందించిన నాగుల్‌మీరా లారీతో డస్ట్ తోలించి మెరక చేయించారు. తాను చదువుకున్న పాఠశాలలో మెరక పనులు చేయడం ఆనందాన్ని కలిగించిందన్నారు. హెచ్‌ఎం నాగమల్లేశ్వరి, ఉపాధ్యాయులు నాగుల్‌మీరాను అభినందించారు.

ఐటీఐలో ప్రవేశానికి ఆన్‌లైన్ అడ్మిషన్లు

నూజివీడు: పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐలో ప్రవేశాల కోసం ఆన్‌లైన్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ దేవరకొండ భూషణం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ ట్రేడ్‌లలో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేసేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి కల అభ్యర్థులు ఈనెల 8 నుంచి 19వ తేదీ సాయంత్రం ఐదు గంటల లోపు ప్రభుత్వ ఐటీఐకు చెందిన వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్ దరఖాస్తు కాపీని ప్రింట్ తీసుకుని ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఈనెల 20వ తేదీలోపు పట్టణంలోని ఐటీఐలో వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. వెరిఫికేషన్ పూర్తయిన విద్యార్థులు ఈనెల 22న ఉదయం 9 గంటల నుంచి స్థానిక ఐటీఐలో నిర్వహించే కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలకు రూ.లక్ష విరాళం

చంద్రాల(మైలవరం): మైలవరం మండలం చంద్రాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అభివృద్ధికి దాతలు కాపవరపు వీరాస్వామి, వెంకటసుబ్బమ్మ జ్ఞాపకార్థం వారి కుమారుడు కె.నారాయణరావు రూ.లక్ష విరాళంగా అందజేసినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వరదా శ్రీనివాసరావు గురువారం తెలిపారు. నారాయణరావు ఎస్ఏ(ఇంగ్లిష్ జెడ్పీహెచ్ స్కూల్), ఏలూరు జిల్లా ముసునూరు మండలం, వేల్పుచర్ల వాస్తవ్యులు. ఈ నగదుపై ప్రతి ఏడాది వచ్చే వడ్డీని పాఠశాలలో చదివే 10వ తరగతి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానం సాధించిన విద్యార్థులకు రూ.2,500, 2,000, 1,500 బహుమతిగా ఇవ్వనున్నారు. ఈ ఏడాది విద్యార్థులు అరివేణి వినయ్ వేదాద్రి 489 మార్కులు, కొలుసు దివ్య 481మార్కులు, కందుల మేఘన 476 మార్కులు పొంది నగదు బహుమతులు అందుకున్నారు.

వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేత



కొండపర్వ(విస్సన్నపేట): మండలంలోని కొండపర్వ గ్రామానికి చెందిన కోపూరి గ్రేసమ్మ కుమారుడు రామారావు బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో వైఎస్సార్ బీమా పథకం తక్షణ సాయంగా మట్టి ఖర్చుల నిమిత్తం రూ.10 వేలు నగదు మృతుడి కుటుంబ సభ్యులకు సర్పంచ్ జి.రమేష్‌బాబు గురువారం అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గాజుల శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ పి.ప్రవీణ్, సచివాలయ కన్వీనర్ ఎస్ మంగయ్య, నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా కృష్ణాష్టమి వేడుకలు



కొండపల్లి బీ కాలనీలో వేడుకలు

ముసునూరు: ముకుంద, మాధవ, గోవింద, నామస్మరణలు, బాజా భజంత్రీల మంగళ వాయిద్యాలు, తీన్‌మార్‌లు, చెక్క భజనలు, బాలల కోలాటాల సందడి నడుమ సంప్రదాయ రీతిలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు అంగరంగ వైభవంగా ఆయా ఆలయ కమిటీల భక్తుల ఆధ్వర్యంలో మండలంలో గురువారం ఘనంగా నిర్వహించారు. లోపూడిలోని ప్రసిద్ధ వేణుగోపాలస్వామి ఆలయంతో పాటు ముసునూరు, వేల్పుచర్ల, గోపవరం, కాట్రేనిపాడు, గోగులంపాడు, రమణక్కపేట, చెక్కపల్లి, బాసవరప్పాడు, గుడిపాడు, తదితర గ్రామాల్లోని ఆలయాల వద్ద ఉత్సవాలు నిర్వహించి, యువత ఉట్టికొట్టే కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. లోపూడిలో శ్రీ వేణుగోపాలస్వామి వారిని ముస్తాబు చేసి ఆలయ అర్చకులు కిరణ్‌కుమార్ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామి వారిని పుష్పమాలలతో అలంకరించి, ఆయా గ్రామాల వీధులలో ఊరేగింపులు నిర్వహించారు. ఆలయ కమిటీల ఆధ్వర్యంలో అన్నదానాలు ఏర్పాటు చేశారు. అర్ధరాత్రి వరకూ జరిగిన కార్యక్రమాల్లో చిన్నాపెద్దా తేడాలేకుండా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీకృష్ణ భగవన్నామస్మరణ చేస్తూ ఉత్సవాలను ఆద్యంతం తిలకించారు.

తిరువూరు: కృష్ణాష్టమి వేడుకలను తిరువూరు పట్టణంలోని పలు పాఠశాలలో వైభవంగా నిర్వహించారు. శ్రీనిధి స్కూల్‌లో బాలబాలికలను శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణతో ఉట్టి కొట్టే కార్యక్రమం జరిపారు. చిన్నారుల నృత్యరూపాలు ఆకట్టుకున్నాయి. సిద్ధార్థ, భాష్యం, గీతమ్స్ స్కూళ్లలోనూ కృష్ణాష్టమి వేడుకలు జరిగాయి.

నేడు సామూహిక వరలక్ష్మి వ్రతం

నెమలి(గంపలగూడెం): శ్రావణ మాసం ప్రత్యేక కార్యక్రమాల్లో భాగంగా నెమలి శ్రీవేణుగోపాల స్వామి ఆలయంలో శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మహిళలచే సామూహిక వరలక్ష్మి వ్రతం నిర్వహిస్తున్నట్లు ఆలయ సహాయ కమిషనర్ దాసరి శ్రీరామ వరప్రసాదరావు తెలిపారు. పూజా ద్రవ్యములు ఎవరికి వారు సమకూర్చుకోవాలని, వ్రతం పీటలపై కూర్చొనే మహిళలకు ఎలాంటి రుసుం లేదన్నారు.

తిరువూరు రూరల్‌లో..

తిరువూరురూరల్: గానుగపాడు, గోకుల్‌నగర్‌లలో యాదవ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు యరదేశి రామారావు ఆధ్వర్యంలో గోపూజ, శ్రీరాధాకృష్ణులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉట్టి కొట్టే కార్యక్రమంలో యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

శ్రీకృష్ణ సేవాసమితి ఆధ్వర్యంలో..



గానుగపాడులో పూజలు చేస్తున్న భక్తులు



తిరువూరు యాదవ సంఘం ఆధ్వర్యంలో..

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి బీ కాలనీలో శ్రీకృష్ణ సేవాసమితి ఆధ్వర్యంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఎన్టీటీపీఎస్ చీఫ్ ఇంజినీర్ నవీన్‌గౌతమ్, జెన్‌కో శిక్షణ సంస్థ సీఈ నాగభూషణరావు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా గాన కచేరిలో భక్తిగీతాలు ఆలపించారు. మధ్యాహ్నం వీధుల్లో శ్రీకృష్ణుని ఊరేగింపు కనులపండువగా జరిపారు. యువకులు ఉట్టికొట్టే కార్యక్రమంలో పాల్గొని కేరింతలు కొట్టారు. ఊరేగింపులో బాలబాలికల చేసిన కోలాటం ఆకట్టుకుంది.

చాట్రాయిలో..

చాట్రాయి: మండలంలోని అన్ని గ్రామాల్లో గురువారం కృష్ణాష్టమి వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. రాత్రి రంగురంగుల విద్యుత్ దీపాల మధ్య యువతీ యువకులు ఉత్సాహంగా రంగులు చిమ్ముకుంటూ ఉట్లు కొట్టారు. చాట్రాయి గొల్లగూడెంలో శ్రీకృష్ణుడిని ఊరేగించారు.

తిరువూరులో..

తిరువూరు: తిరువూరు పట్టణంలోని పలు దేవాలయాల్లో వేడుకలు ఘనంగా నిర్వహించారు. శ్రీవేంకటాచలస్వామి దేవస్థానంలో రాధాకృష్ణులకు విశేష పూజలు జరిపారు. శ్రీశ్యామవేదిలో గౌడీయ మఠ సంప్రదాయాన్ని అనుసరించి పూజాదికాలు, నివేదనలు సమర్పించారు. రాజుపేట శ్రీవీరాంజనేయస్వామి దేవస్థానంలో 108 రకాల నైవేద్యాలను సమర్పించారు. శాంతినగర్‌లో యాదవ సంక్షేమ సంఘ తిరువూరు నియోజకవర్గ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు.



కాట్రేనిపాడులో కృష్ణాష్టమి వేడుకలు



గంపలగూడెం రామాలయంలో చిన్నారుల వేషధారణలు



నెమలిలో ఉట్టి కొడుతున్న యువత

150 రకాల వంటకాలతో నివేదన

నెమలి(గంపలగూడెం): బాలగోపాలుని జన్మదినోత్సవ వేడుకలను గురువారం మండలంలోని పలు గ్రామాల్లో అత్యంత వైభవంగా జరిపారు. గంపలగూడెం భజన మందిరంలో జట్ వికాస తరంగిణి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో స్వామి వారికి ప్రీతిపాత్రమైన 150 రకాల వంటకాలను మహిళలు ఇళ్ల వద్ద తయారు చేసి తీసుకువచ్చి స్వామికి భక్తిశ్రద్ధలతో నైవేద్యం సమర్పించారు. ముందుగా స్వామి వారికి విశేషపూజలు నిర్వహించారు. జట్‌వికాస్ తరంగిని అధ్యక్షురాలు కొల్లా కృష్ణకుమారి, పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. గంపలగూడెం సీతారామచంద్రస్వామి ఆలయంలో శ్రీ కృష్ణ జన్మాష్టమి సందర్భంగా చిన్నారులచే నిర్వహించిన గోపిక, కృష్ణుల వేషధారణ భక్తులను విశేషంగా ఆకర్షించింది. అనంతరం ఉట్టి ఉత్సవం కోలాహలంగా సాగింది. ఊటుకూరు సిద్దార్థ విద్యాలయంలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ రకాల వేషధారణలతో ఆకట్టుకున్నారు.



150 రకాల వంటకాలతో శ్రీకృష్ణునికి నైవేద్యం సమర్పిస్తున్న భక్తులు

అందరి నేస్తం జగనన్న ప్రభుత్వం

- నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు
- నూతన లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ



ఆగిరిపల్లిలో పింఛన్లను అందజేస్తున్న ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు

ముసునూరు: రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి పథకాలు అందజేస్తూ, అందరి నేస్తంగా జగనన్న ప్రభుత్వం చరిత్ర సృష్టించిందని నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో నూతనంగా మంజూరైన లబ్ధిదారులకు గురువారం ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు పింఛన్లను అందజేశారు. మండల కేంద్రం ముసునూరు మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీడీఓ జి.రాణి ఆధ్వర్యంలో ఎంపీపీ రాపర్ల కృష్ణకుమారి అధ్యక్షతన 148 మంది నూతన పింఛన్‌దారులకు రూ.4,11,500 పింఛన్ నగదును, ధ్రువీకరణ పత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పథకాలను సృష్టించి, అమలు జరపడంలో జగనన్న ప్రభుత్వం దేశంలోనే నంబర్ వన్‌గా నిలిచిందన్నారు. అనంతరం పథకాల సృష్టికర్త సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు డాక్టర్ వరికూటి ప్రతాప్, వైస్ ఎంపీపీ రాజానాయన, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఎం.నాగమల్లేశ్వరరావు, డీటీ ఎమిలీ కుమారి, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వ్యవసాయ సొసైటీల అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, సీనియర్ నేతలు, కార్యకర్తలు, అభిమానులు, పలు శాఖల అధికారులు, సచివాలయాల సిబ్బంది, వలంటీర్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఠంఛన్‌గా పింఛన్ల పంపిణీ

చాట్రాయి: ఠంచన్‌గా ఒకటో తేదీనే పెన్షన్లు పంపిణీ చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కిందని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు స్పష్టం చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కొత్తగా మంజూరైన పెన్షన్‌దారులకు ఎమ్మెల్యే పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చంద్రబాబు హయాంలో జన్మభూమి కమిటీలతో లబ్ధిదారులను ఎంపిక చేసి టీడీపీ వారికే మంజూరు చేశారని, ఆ పెన్షన్ కోసం 10 రోజుల వరకు చెట్ల కింద పడిగాపులు కాయాల్సి వచ్చేదన్నారు. 350 ఎకరాలు భూమిని కబ్జా చేశారని కొంత మంది ఆరోపిస్తున్నారని, ఇది నిరూపిస్తే చంద్రబాబు, లోకేశ్‌లకు ఇస్తామని ఆయన సవాల్ విసిరారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీకి ఓటు వేస్తే గోదావరిలో వేసినట్టేనని చెప్పారు. అనంతరం 371 మందికి కొత్త పెన్షన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కో–ఆపరేటివ్ యూనియన్ రాష్ట్ర చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి, చాట్రాయి గ్రామ సర్పంచ్ దామెర ఉషా, ఎంపీటీసీ సభ్యులు సంకు శివకుమారి, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు పుచ్చకాయల సుబ్బారెడ్డి, చల్లగుళ్ల జగన్‌మోహనరావు, ఎంపీడీవో దుర్గాప్రసాద్, తహసీల్దార్ విశ్వనాథరావు, నాయకులు చెలికాని బాబ్జీ, దామెర ప్రసాదు బాబు, కారంగుల వాసు, మిద్దె బాలకృష్ణ, పల్లె రవింద్రారెడ్డి, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.



ముసునూరులో సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే మేకా అప్పారావు



చాట్రాయిలో లబ్ధిదారులకు పింఛన్లు అందజేస్తున్న ఎమ్మెల్యే మేకా అప్పారావు

ఆగిరిపల్లిలో పింఛన్ల అందజేత

నూజివీడు (ఆగిరిపల్లి): ప్రజల మనస్సుల్లో గూడుకట్టుకుని ఉన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని ఎన్ని పార్టీలు కలిసి వచ్చినా ఏమీ చేయలేవని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. ఆగిరిపల్లి మండలానికి నూతనంగా మంజూరైన 501 పింఛన్లను గురువారం నిర్వహించిన కార్యక్రమంలో లబ్ధిదారులకు ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏపీలో అమలవుతున్నన్ని సంక్షేమ పథకాలు దేశంలో ఏ రాష్ట్రంలో అమలు కావడం లేదన్నారు. చంద్రబాబు దిగిపోయే నాటికి మండలంలో 6,915 పింఛన్లు ఉండగా, నేడు 9,894 పింఛన్లు ఉన్నాయన్నారు. అంటే ఈ నాలుగేళ్లలో 2,979 పింఛన్లను నూతనంగా ఇచ్చామని చెప్పారు. రాబోయే ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్‌కు అండగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో పి.శంకర్‌రావు, తహసీల్దార్ ఉదయభాస్కర్, జెడ్పీటీసీ పిన్నిబోయిన వీరబాబు, ఎంపీపీ గొల్ల అనూష, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి మచ్చా హరిబాబు, ఉపాధ్యక్షుడు తులిమెల్లి సుజనకుమారి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పలగాని నరసింహారావు, వైస్ ఎంపీపీ గడ్డం సాంబశివరావు, నాయకులు ఈలప్రోలు వెంకట సుబ్బయ్య, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఈ – క్రాప్ నమోదు సక్రమంగా చేయాలి

తిరువూరు ఎమ్మెల్యే రక్షణనిధి



గంపలగూడెంలో అధికారులతో సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రక్షణనిధి

గంపలగూడెం: ఖరీఫ్ సీజన్‌లో సాగుచేసిన పైర్లకు సంబంధించి ఈ – క్రాప్ నమోదు సక్రమంగా చేసి విపత్కర పరిస్థితులు ఎదురైనప్పుడు రైతాంగం నష్టపోకుండా చూడాలని తిరువూరు ఎమ్మెల్యే కె.రక్షణనిధి తెలిపారు. గంపలగూడెం మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మండల స్థాయి వివిధ శాఖల అధికారులతో ఆయన సమీక్షా సమావేశం జరిపారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఈ – క్రాప్ నమోదైన పైర్లకు మాత్రమే వచ్చే ప్రయోజనాలను రైతులకు వీఏఏ, వీహెచ్‌ఏలతో అవగాహన కల్పించాలని వ్యవసాయాధికారి బి.సాయిశ్రీని ఆదేశించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా గ్రామాల్లో మంజూరు చేసిన సిమెంట్ రోడ్లు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. పనులు ఏఏ దశల్లో ఉన్నది పంచాయతీరాజ్ ఏఈ పూర్ణచంద్రరావును అడిగి తెలుసుకున్నారు. పనులకు సంబంధించి ఎప్పటికప్పుడు బిల్లులు రికార్డు చేస్తే వెంటనే మంజూరవుతామని చెప్పారు. సిమెంట్ రోడ్ల నిర్మాణంతో గ్రామాల్లో ప్రజలు దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న రహదారుల సమస్యలకు పరిష్కారమైందన్నారు. ఇంకా ప్రారంభించని పనులను వెంటనే చేపట్టాలని సూచించారు.

కొణిజెర్లలో ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

రైతులకు సాగునీటి ఇబ్బంది లేకుండా వినగడప, ఊటుకూరు చెరువులకు ఏర్పడిన గండ్లు పూడ్చివేతకు ఎం–బుక్ రికార్డు పూర్తిచేసి ఎంపీడీఓకు అప్పగిస్తే మండల పరిషత్ నిధుల నుంచి నగదు విడుదల చేస్తారని పీడబ్ల్యూడీ ఏఈ కిషోర్‌కు తెలిపారు. కొణిజెర్లలో ప్రభుత్వ భవనాల నిర్మాణానికి సహకరించిన ఐదుగురికి ప్రత్యామ్నాయంగా ఇళ్ల స్థలాలు వెంటనే అందజేయాలని తహసీల్దార్ బాలకృష్ణారెడ్డికి తెలిపారు. జగనన్న శాశ్వత భూహక్కు, భూసర్వేలో భాగంగా స్వామిత్వ సర్వేలో గ్రామాల్లో ప్రభుత్వ భూమిని అంగుళం కూడా వదిలిపెట్టకుండా స్వాధీనపర్చుకోవాలన్నారు. నెమలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణ చుట్టూ ప్రహరీ నిర్మాణం విషయమై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎంఈఓ పీవీడీఎల్ నరసింహారావును ఆదేశించారు. గ్రామాల్లో అవసరమైన చోట విద్యుత్ ప్రధాన లైన్లు, స్తంభాల ఏర్పాటు చేసి సమస్యలు లేకుండా చూడాలని, స్థానికంగా సిబ్బందితో సక్రమంగా పనిచేయించాలని విద్యుత్‌శాఖ ఇంజినీర్ కొమ్మువాసు ఆదేశించారు. కొందరు సిబ్బంది పనితీరుపై ఆరోపణలు ఉన్నాయని తగిన చర్యలు తీసుకొని వినియోగదారులకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. వర్షాకాలం నేపథ్యంలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందజేసేలా ఆరోగ్యశాఖ సిబ్బంది పనిచేయాలన్నారు. జెడ్పీటీసీ సభ్యులు కోట శామ్యూల్, ఎంపీడీఓ వై.పిచ్చిరెడ్డి, తహసీల్దార్ బాలకృష్ణారెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఈకేవైసీ తప్పనిసరి

లక్ష్మీపురం(తిరువూరురూరల్): ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగు చేసే రైతులు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించాలని తిరువూరు మండల వ్యవసాయాధికారి పద్మ సూచించారు. మండలంలోని లక్ష్మీపురంలో గురువారం ఈకేవైసీ ప్రక్రియను ఆమె పర్యవేక్షించారు. రైతులు త్వరితగతిన ఈకేవైసీ పూర్తి చేయించుకోవాలన్నారు. ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంట నష్టం జరిగితే పరిహారం పొందడానికి, పంట విక్రయాలకు ఈ క్రాప్ తోడ్పాడుతుందన్నారు.

‘ఆడుదాం ఆంధ్రా’కు క్రీడా స్థలాలను సిద్ధం చేయాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో వీఏ విజయ్‌కుమార్

నూజివీడు: ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలు అక్టోబర్ 2 నుంచి ప్రారంభమవుతున్నందున క్రీడా స్థలాలను గుర్తించి వాటిని సిద్ధం చేయాలని ఎంపీడీవో వీఏ విజయ్‌కుమార్ ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీల నిర్వహణపై ఎంఈవోలు, హైస్కూల్ హెచ్‌ఎంలు, పీడీలు, సచివాలయ సిబ్బందితో గురువారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ క్రీడా స్థలాలను గుర్తించిన అనంతరం వాటిల్లో అవసరమైన మేరకు మట్టిని తోలించి చదును చేయడం జరుగుతుందన్నారు. ఆటల పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు మధ్యాహ్న భోజన పథకం నుంచి భోజన వసతిని కల్పించాలని సూచించారు. ఈ పోటీల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, షటిల్, క్రికెట్ పోటీలు నిర్వహిస్తామన్నారు. 15 ఏళ్ల పైబడిన వారు ఈ పోటీల్లో పాల్గొనేందుకు అర్హులని, గ్రామస్థాయిలో గ్రామ సచివాలయంలో తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయిల్లో ఈ పోటీలు నిర్వహిస్తారని, క్రీడా స్థలాలను ఇప్పటి నుంచే గుర్తించి వాటిని సిద్ధం చేసుకోవాలన్నారు. అందరూ సమన్వయంతో పనిచేసి ఆటల పోటీలను విజయవంతం చేయాలని సూచించారు. సమావేశంలో ఎంఈవో–2 జమలయ్య, హెచ్‌ఎంలు, పీడీలు పాల్గొన్నారు.

మాస్టారు దాతృత్వం అభినందనీయం



విద్యార్థులకు నగదు బహుమతులు అందజేస్తున్న మాస్టారు దంపతులు

ముసునూరు: జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో ప్రతిభావంతులైన విద్యార్థులకు నగదు బహుమతులు అందించి, వారిని ఉన్నత విద్య వైపు ప్రోత్సహించడం అభినందనీయమని హెచ్‌ఎం ఎం.శ్రీనివాస్ అన్నారు. వేల్పుచర్ల హైస్కూల్‌లో గతేడాది పదో తరగతి ఫలితాల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులు ఇందుశ్రీకి రూ.2,500, సాయిచందుకు రూ.2 వేలు, ప్రవల్లికకు రూ.1,500 నగదు బహుమతులను ఇంగ్లిష్ ఉపాధ్యాయుడు కేవీ నారాయణరావు, దుర్గారాణి దంపతులు గురువారం అందజేశారు. మాస్టారు దంపతులను అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

12న మండల స్థాయి క్రీడా జట్ల ఎంపిక

విస్సన్నపేట: మండల స్థాయి స్కూల్ గేమ్స్ బాల బాలికల అండర్ – 14, 17 విభాగాల్లో క్రీడాకారుల జట్టు ఎంపిక ఈ నెల 12, 13వ తేదీల్లో మండలంలోని పుట్రేల జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ –2 ఈ.సుధాకర్ గురువారం తెలిపారు.

మండల స్థాయి క్రీడల పోటీల్లో వాలీబాల్, కబడ్డీ, త్రోబాల్, బాల్‌బ్యాడ్మింటన్, షటిల్, యోగా, టెన్నీ కాయిట్, ఖోఖో, అథ్లెటిక్స్ వంటి తొమ్మిది రకాల ఆటల పోటీలు జరుగుతాయరు. వివరాలకు పుట్రేల హైస్కూల్ పీడీ 99498 33159 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలన్నారు. సమావేశంలో హెచ్‌ఎం సౌభాగ్యమ్మ పాల్గొన్నారు.

కొండపల్లిలో పింఛన్ల పంపిణీ



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లిలో నూతనంగా మంజూరైన సామాజిక పింఛన్లను ఒకటి, 11వ వార్డు కౌన్సిలర్లు మండే చంద్రశేఖర్, అడపా వెంకయ్యనాయుడు గురువారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పార్టీలు, కులాలు, మతాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా పింఛన్లు అందిస్తున్నారన్నారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వార్డు వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

70 మందికి నేత్ర పరీక్షలు

ఆంజనేయపురం(తిరువూరురూరల్): ఆంజనేయపురం సచివాలయం వద్ద గురువారం నేత్ర వైద్యశిబిరం నిర్వహించారు. విజయవాడ ఈవెంటా నేత్ర వైద్యశాల వైద్యులు శిబిరంలో 70 మందికి నేత్ర పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేశారు. శస్త్రచికిత్స అవసరమైన వారిని విజయవాడకు తరలించారు. సర్పంచ్ కుటుంబరావు పర్యవేక్షించారు.